నమస్తే తెలంగాణ
సూర్యాపేట
10 | నల్లగొండ, ఆదివారం 12 మే 2024 | SURYAPET

## బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవడం

# అత్యవసరం

**ప్రజలు ఇప్పటికే కచ్చితమైన నిర్ణయానికి వచ్చారు**

**కేసీఆర్‌కు బలమిస్తేనే కాంగ్రెస్ హామీలను నెరవేర్చుతుందనే నమ్మకం**

**జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం**



**మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట, మే 10 (నమస్తే తెలంగాణ) : 'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవడం ప్రజలకు అత్యవసర పరిస్థితి. ఈ మేరకు ఇప్పటికే ప్రజలు తమ పార్టీని గెలిపించుకోవడానికి కృతనిశ్చయానికి వచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారానికి వెళ్తే ప్రజల నుంచి అమోఘమైన స్పందన వచ్చింది'. అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం, ప్రజల స్పందన, బీఆర్‌ఎస్ గెలుపుపై అంచనాలు, తదితరాలపై మీడియాతో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

కాంగ్రెస్ పార్టీకి ఒక్క చాన్స్ ఇస్తే నాలుగు నెలల్లోనే స్వయం ప్రకటిత కరువును తేవడంతోపాటు కొత్తగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. గతంలో కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాలను కూడా కొనసాగించలేని దుస్థితిలో ఉన్నదనే విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడుతూ నల్లగొండలో కేసీఆర్ గర్జిస్తే తోకముడిచి వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసింది. పంటలు ఎండిపోతుంటే కరువు యాత్ర చేపట్టడంతో సమయం దాటిపోయినా హుటాహుటిన నీటిని విడుదల చేయడం, రైతుబంధు ఇవ్వడం జరిగింది. ఈ లెక్కన ప్రతి సారీ కేసీఆర్ నోరు తెరిస్తే తప్ప తమకు న్యాయం జరుగడం లేదని ప్రజలు గుర్తించారు. అందుకే ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌కు మరింత బలాన్ని ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు రెండు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

### జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా.. పంటలను ఎండబెట్టారు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద ఒక్క తడికి నీటిని ఇస్తే లక్షలాది ఎకరాల్లో పంట చేతికి అందేది. కానీ.. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా సాగర్ కట్ట ఎక్కే దమ్ము లేకపోయింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు సార్లు కరువు చాయలు అలుముకుంటే సాగర్ నీటి మట్టం డెడ్ స్టోరేజీలో ఉన్నా నాటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నీళ్లు వదిలి పంటలను కాపాడాం. నాటి కన్నా సాగర్‌లో ఎక్కువ జలాలు ఉన్నా నీటిని విడుదల చేయించలేని జిల్లా మంత్రులను రైతులు ఈసడించుకుంటున్నారు. వాస్తవానికి కృష్ణాకు సమస్య వస్తే గోదావరి నుంచి నీటిని తీసుకోవడానికి గతంలో కేసీఆర్ ప్రయత్నాలు చేసి సాగర్ ఎడమ కాల్వను బతికించుకునేందుకు కాళేశ్వరం మూడో టీఎంసీ ఆలోచన చేసి ప్రతిపాదనలు కూడా తయారు చేయించారు.

### ప్రజల నుంచి స్పందన అమోఘం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసినవి కొనసాగించకపోవడంతో ఆ పార్టీపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అందుకే లోక్‌సభ ప్రచారాల్లో గులాబీ జెండా కనిపిస్తే ఎదురొచ్చి పలుకరిస్తున్నారు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఊహించిన దానికన్నా ఎక్కువ ఉత్సాహంతో ప్రచారాలు చేశారు. కేసీఆర్ పర్యటనలు కాకుండా తాము పట్టణాలు, పల్లెల్లో రోడ్ షోలు నిర్వహిస్తే స్వచ్ఛందంగా ఇసుకేస్తే రాలనంత స్థాయిలో జనం వచ్చారు. దాంతో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమైనట్లు నిర్ధారణకు వచ్చాం.

### బీఆర్‌ఎస్ గొంతును ఎండనీయవద్దని ప్రజల్లో బలంగా ఉంది

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం పుట్టిన బీఆర్‌ఎస్ విజయం సాధించి తొమ్మిదిన్నరేండ్ల పాటు దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్ది ప్రజలకు కావాల్సిన అన్నీ సమకూర్చింది. నాలుగు నెలల క్రితం మాయమాటలు, 420 మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కొత్త హామీలు అమలు చేయకపోగా కేసీఆర్ చేపట్టిన పాత వాటిని కూడా కొనసాగించడం లేదు. ఈ విషయాన్ని గ్రహించి తాము మోసపోయామని ప్రజలు మదనపడుతున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకొని ఆ పార్టీ గొంతు ఎండకుండా ఉంటేనే తమకు న్యాయం జరుగుతుందని ప్రజలు కచ్చితమైన నిర్ణయానికి వచ్చారు. అందుకే ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని రెండు పార్లమెంట్ స్థానాలను గెలిపించుకోవడం అత్యవసరం అని ప్రజలకు అర్థమైంది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అడిగినా, అడగకున్నా.. ఎలాంటి ఉద్యమాలు, నిరసనలు చేపట్టకున్నా ప్రజలకు అవసరమున్న వాటిని గుర్తించి వారి అభ్యున్నతి కోసం పథకాలు చేపట్టారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా విజయాలు సాధిస్తున్నారు.

### నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం

నదీ జలాల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలది ఒకే గొంతుక. గోదావరి, కృష్ణా నదీ జలాల విషయంలో ఈ రెండు పార్టీల రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా ఆయా రాష్ట్రాలకు జలాలను పంచేందుకు ఒక్క తాటిపైకి వచ్చాయి. కాబట్టి తెలంగాణ కోసం ఎవరూ కొట్లాడరు. తెలంగాణ ప్రజల గురించి ఆ రెండు పార్టీలు ఆలోచన చేయవు. ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలను కృష్ణార్పణం చేయగా, గోదావరి జలాలను తమిళనాడుకు తరలించేందుకు ఏ పార్టీకి ఆ పార్టీ మాట్లాడుతున్నాయి. ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణను ఎడారిని చేస్తాయి. ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 60 శాతం భూములు ఎడారిగా మారే ప్రమాదం ఉంది.

### రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అంతకుముందు కేసీఆరే అప్పగించారని బుకాయించారు. దీంతో కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టి గర్జిస్తే తోక ముడిచి కేఆర్‌ఎంబీకి అప్పగించబోమని అసెంబ్లీలో తీర్మానం చేసింద్రు. కేసీఆర్ కరువు యాత్ర చేపట్టడంతో కాల్వల్లో కొంతమేర నీళ్లు పారినై. రైతుబంధు ఇచ్చింద్రు. ఇలా ప్రతి సారీ కేసీఆర్ నోరు తెరిస్తే తప్ప తమకు న్యాయం జరుగడం లేదని ప్రజలు గుర్తించారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే కొట్లాడేందుకు బీఆర్‌ఎస్ ఉండాలి. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌కు బలం ఉండాలంటే పార్లమెంట్ సీట్లు ఇవ్వాలనే కృతనిశ్చయానికి ప్రజలు వచ్చారు. ఈ సారి కేంద్రంలో ఎన్డీఏ, ఇండియా కూటమికి పూర్తి మెజారిటీ రాదు. అక్కడ ప్రాంతీయ పార్టీలదే ప్రధాన పాత్ర కాబోతుంది. అందుకని ఇక్కడ బీఆర్‌ఎస్‌కు పట్టం కడితే ప్రజల బతుకులు బాగుపడుతాయి. ప్రజల తరఫున కొట్లాడేందుకు అవకాశం ఉండాలంటే జిల్లాలోని నల్లగొండ, భువనగిరి స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి. అని జగదీశ్‌రెడ్డి కోరారు.



నకిరేకల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి, బీఆర్‌ఎస్ నేత చెరుకు సుధాకర్

## కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే

# కరువు కాటకాలే..

**24 గంటల కరెంటు ఇవ్వలేని దద్దమ్మలకు ఓటెందుకెయ్యాలి**

**బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి**

**నకిరేకల్ రోడ్ షోలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**

నకిరేకల్, మే 11 : కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే 2014కు ముందున్న కరువు కాటకాలు పునరావృతమవుతాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. 24 గంటల కరెంటు, మంచినీళ్లు ఇవ్వలేని చేతగాని దద్దమ్మలకు ఓటెందుకెయ్యాలని ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ పట్టణంలో కనకదుర్గ గుడి నుంచి మెయిన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెసోళ్లకు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇచ్చారా..? రైతు బంధు రూ.15వేలు వచ్చినయా? వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చారా? రూ.2 లక్షల రుణమాఫీ చేశారా? కల్యాణలక్ష్మి డబ్బుతోపాటు తులం బంగారం ఇచ్చారా? అని ప్రజలను అడిగారు. అడగకపోయినా అన్నం పెట్టిన పెద్ద కొడుకు లాంటి కేసీఆర్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, రేవంత్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయక వ్యంగ్య మాటలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లు అడిగేందుకు సిగ్గుండాలన్నారు. బీజేపీకి ఓటు వేస్తే గోదావరి నీళ్లు తెలంగాణలో పారవని, రాష్ట్రం ఎడారిగా మారడం ఖాయమని పేర్కొన్నారు. తాగు, సాగు నీరు లేక 2014కు ముందు దుస్థితిని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో దుర్మార్గపు రాజ్యం పోవాలంటే బీఆర్‌ఎస్‌ను 16 స్థానాల్లో గెలిపించాలన్నారు. 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే ఢిల్లీలో ఆయన గళం విప్పుతారని చెప్పారు. కాంగ్రెస్ మోసాలను గుర్తించి బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



నకిరేకల్ బీఆర్‌ఎస్ ర్యాలీకి పెద్ద ఎత్తున పాల్గొన్న జనం

ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ కేసీఆర్ ఏ రోజూ దేవుడిని రాజకీయంగా వాడుకోలేదన్నారు. దేవుడు వేరు, అభివృద్ధి వేరు అని ప్రజలు గమనించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికి ప్రచారానికి వెళ్లినా దేవుళ్లపై ఒట్టు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి సీఎం కేసీఆర్ రైతు బంధు కోసం రూ.7,500 కోట్లను ప్రభుత్వ ఖజానాలో వేశారని, కాంగ్రెస్ గెలిచాక వాటిని రైతులకు ఇవ్వకుండా తప్పుదోవ పట్టించారని అన్నారు. తాను 35 ఏండ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, తనపై ఆవగింజంత తప్పు కూడా లేదని పేర్కొన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని హామీనిచ్చారు.

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ గతంలో భువనగిరి ఎంపీలుగా ఉన్న కోమటిరెడ్డి బ్రదర్స్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు ప్రజలను మోసం చేసి గెలవాలని చూస్తున్నదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీలు మాద ధనలక్ష్మీనగేశ్, తరాల బలరాం, బొప్పని స్వర్ణలత సురేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు ప్రగడపు నవీన్‌రావు, కేశవరాజు, యల్లపు రెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన ప్రచారం..

చివరి రోజు రోడ్‌షోలు, ర్యాలీలు

ఇక పోల్ మేనేజ్‌మెంట్‌పై అందరి దృష్టి

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

నేడు సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్న సిబ్బంది

రేపు ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్

11లో...


